

సాక్షి
ఖమ్మం
శనివారం। 7। జూన్। 2025



..వేడుకకు ముస్తాబు

మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటై యాభై ఏళ్లు దాటిన సందర్భంగా ఆదివారం స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. 10లో



103 శాతం బొగ్గు ఉత్పత్తి

సింగరేణి వ్యాప్తంగా గత నెలలో 103శాతం బొగ్గు ఉత్పత్తి నమోదైందని సంస్థ తన నివేదికలో వెల్లడించింది. 10లో

గరిష్టం / కనిష్టం
40° / 27°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నానికి ఉష్ణోగ్రత గరిష్టస్థాయికి చేరే అవకాశముంది.

న్యూస్‌రీల్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న న్యాయమూర్తులు

ఖమ్మం లీగల్: పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా భావించాలని న్యాయసేవా సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి చంద్రశేఖరరావు సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం న్యాయ సేవా సంస్థ కార్యాలయం ఆవరణలో చంద్రశేఖరరావు, మొబైల్ కోర్టు న్యాయమూర్తి నాగలక్ష్మి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతా ఆరోగ్యం ఉండడం, పర్యావరణ సమతుల్యత కోసం మొక్కలు నాటడం ఒక్కటే మార్గమని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ముప్వా నాగేశ్వరరావు, న్యాయ సేవా సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

డ్రోన్లు, ఈవీల మరమ్మతుల్లో మహిళలకు శిక్షణ

ఖమ్మంఅర్బన్: ఐటీఐ పూర్తి చేసిన మహిళా అభ్యర్థులకు ఖమ్మం జిల్లా మహిళా ప్రాంగణం ఆధ్వర్యాన తొలిసారి డ్రోన్లు, ఎలక్ట్రిక్ వాహనాల మరమ్మతుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు మేనేజర్ వేల్పుల విజేత తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఐటీఐ సర్టిఫికెట్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, మూడు ఫొటోలు జత చేసిన దరఖాస్తులను టేకులపల్లిలోని మహిళా ప్రాంగణంలో ఈనెల 9నుంచి 12వరకు అందజేయాలని సూచించారు. నెల పాటు శిక్షణ కోసం ప్రతీ ట్రేడ్‌లో ముప్పై మందిని మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తామని ఆమె తెలిపారు. కాగా, డ్రోన్ మరమ్మతుల శిక్షణకు ఏదైనా ట్రేడ్‌లో ఐటీఐ, ఈవీ మెకానిక్ శిక్షణకు డీజిల్ మెకానిక్ ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులైన వారు అర్హులని మేనేజర్ వెల్లడించారు.

నిరంతర సరఫరా కోసం కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ వేణుగోపాలాచారి

బోనకల్: మెరుగైన విద్యుత్ సరఫరా కోసం అవసరమైన చోట్ల కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేయిస్తున్నట్లు ఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల ఫోరం(సీజీఆర్ఎఫ్) చైర్‌పర్సన్ ఎన్.వీ.వేణుగోపాలాచారి తెలిపారు. బోనకల్ రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన ఫోరం సదస్సులో ఆయన పాల్గొన్నారు. రావినూతల, చొప్పట్లుపాలెం గ్రామాల రైతులు తమ సుబాబుల్ తోటల మీదుగా 11 కేవీ విద్యుత్ లైన్ వెళ్తుండడంతో గాలిదుమ్ము వచ్చినప్పుడు సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. అలాగే, మరికొందరు అదనపు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుపై వినతిపత్రాలు అందజేశారు. అనంతరం వేణుగోపాలాచారి మాట్లాడుతూ వినియోగదారులు సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో ఫోరం సభ్యులు కె.రమేష్, చరణ్‌దాస్, ఎం.రామారావు, వైరా డీఈ బి.శ్రీనివాసరావు, ఏడీఈ పి.కిరణ్‌కుమార్, ఏఈలు సుందర్‌కుమార్, సాయికుమార్, టి.మనోహర్, ఎస్ఏఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ కవచధారణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలను గావించారు.

పాతాళగంగ పరవళ్లు

జిల్లాలో భూగర్భ జలాల పెరుగుదల ఆశాజనకంగా నమోదైంది. భూగర్భ జలాలు తగ్గాల్సిన మే నెలలో కూడా దాదాపు 1.41 మీటర్ల మేర పైకి చేరినట్లు భూగర్భ జలశాఖ నివేదికలో పేర్కొంది. జిల్లాలోని పలు మండలాల్లో ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మేల్లో భూగర్భ జలాలు పెరుగుదల ఉండడం విశేషం. జలాశయాల్లో నీరు నిల్వ ఉండడం, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, వేసవిలో కురిసిన వర్షాల కారణంగా ఈ పరిస్థితి నెలకొందని తెలుస్తోంది. గత ఏడాదితో పోలిస్తే మేలో ఒక్క కారేపల్లి మండలం మినహా అన్నిచోట్ల భూగర్భ జలాలు పైకి వచ్చాయి. – సాక్షి ప్రతినిధి, ఖమ్మం



మున్నేటి జలాలతో కళకళలాడుతున్న ప్రకాశ్‌నగర్ చెక్‌డ్యాం

వేసవిలోనూ పైపైనే భూగర్భ జలాలు

- గత ఏడాది మే నెలతో పోలిస్తే పెరిగిన నీటిమట్టం
- కారేపల్లి మినహా మిగతా మండలాల్లో ఆశాజనకమే
- నీటి వనరులతో సాఫీగా వానాకాలం పంటల సాగు

వేసవిలో జలసవ్వడి

గత ఏడాది మార్చి, ఏప్రిల్, మేతో పోలిస్తే ఈ ఏడాది భూగర్భ జలాలు పెరగడం విశేషం. గత మార్చిలో 6.86 మీటర్ల లోతులో నీరు ఉండగా.. ఈ మార్చిలో 5.51 మీటర్ల వద్దే ఉంది. గత ఏప్రిల్‌లో 7.56 మీటర్ల వద్ద నీటిమట్టం నమోదు కాగా, ఈ ఏప్రిల్‌లో 5.88 మీటర్లకు చేరింది. ఇక గత మే నెలలో 7.30 మీటర్ల వద్ద ఉన్న భూగర్భ జలాల లభ్యత ఈ ఏడాది మే లో 5.89 మీటర్ల వద్దే ఉంది. అంటే మార్చిలో 1.35 మీటర్లు, ఏప్రిల్‌లో 1.68 మీట ర్లు, మే నెలలో 1.41 మీటర్ల మేర భూగర్భ జలాలు పెరిగాయని గణాంకాలు చెబుతున్నాయి. భూగర్భ జల సంరక్షణకు మరిన్ని చర్యలు చేపడితే భవిష్యత్‌లోనూ ఇదే పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు.

ఇరవై మండలాల్లో పుష్కలం

గత ఏడాది మే నెలతో పోలిస్తే ఈ ఏడాది నీటి మట్టం 1.41 మీటర్ల మేరకు పైకి వచ్చింది. కారేపల్లి మండలంలో మాత్రం 1.18 మీటర్ల లోతుకు దిగజారింది. ఈ మండలంలో గత ఏడాది 5.5 మీటర్ల వద్ద నీటి లభ్యత ఉండగా ఈసారి 6.68 మీటర్ల లోతుకు పడిపోవడం గమనార్హం. ఇది కాక మిగతా 20 మండలాల్లో మాత్రం పరిస్థితులు ఆశాజనకంగా ఉన్నాయి. అత్యధికంగా చింతకాని మండలంలో 3.30 మీటర్ల మేర నీటిమట్టం పెరగడం విశేషం. ఆ తర్వాత నేలకొండపల్లి మండలంలో 2.95 మీటర్లు పెరగగా, అతితక్కువగా ఖమ్మం అర్బన్ మండలం 0.16 మీటర్లు పెరిగింది. అలాగే, కామేపల్లి మండలంలో గత ఏడాది మే నెలలో 11.33 మీటర్ల వద్ద ఉన్న భూగర్భ జలాలు ఈసారి 10.69 మీటర్లకు పెరిగాయి.

జల వనరులు.. అకాల వర్షాలు

ఈ వేసవిలో మునుపెన్నడూ లేని విధంగా భూగర్భ జలాలు పెరగడం విశేషం. ఇందుకు అనేక అంశాలు దోహదం చేశాయని చెబుతున్నారు. జలాశయాల్లో నీరు నిల్వ ఉండడం, జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిర్మించిన చెక్‌డ్యామ్‌లు భూగర్భ జలాల పెరుగుదలకు దోహదం చేశాయి. అంతేకాక ప్రతీ వేసవిలో మండటెండలతో నీరంతా ఇంకిపోతుండగా, వడగాల్పులు, సూర్యప్రతాపంతో భూగర్భ జలాలు తగ్గుతాయి. కానీ ఈసారి అడపాదడపా ఎండలు ప్రతాపం చూపించినా ఉపరితల ద్రోణి ప్రభావంతో మే నెలలోనూ వర్షాలు కురిశాయి. తుపాను ప్రభావంతో పలుమార్లు వర్షాలు కురవడంతో ఎండ తగ్గడమే కాక భూగర్భ జలాలు అడుగంటకపోగా మరింత పెరిగాయి.

● సాగుకు ఢోకా లేనట్టే..

ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే ఈ వానాకాలంలో పంటల సాగుకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం లేదు. ఉపరితల ఆవర్తనం, నైరుతి రుతుపవనాల ఆగమనంతో మే చివరలోనే వర్షాలు కురవడంతో రైతులు దుక్కులు సిద్ధం చేసుకున్నారు. మృగశిర కార్తె తర్వాత వర్షాలు బాగా కురుస్తాయని భావిస్తున్నారు. అయితే, ఇప్పటికే జలాశయాల్లోనూ నీరు ఉండడం, భూగర్భ జలాల పెరుగుదల రైతులకు మరింత ఆనందాన్ని కలిగిస్తోంది. సీజన్ తొలినాళ్లలో వర్షాలు కురవకపోయినా అందుబాటులో ఉన్న భూగర్భ జలాలతో సాగు పనులు మొదలుపెట్టవచ్చని చెబుతున్నారు. తద్వారా ప్రాజెక్టులు, చెరువుల కింద ఉన్న ఆయకట్టుతో పాటు బోర్లు, బావుల కింద పంటల సాగు ఊపందుకునే అవకాశముంది.

2024, 2025 మే నెలలో భూగర్భ జలాలు (లోతు - మీటర్లలో)

మండలం	2024	2025	పెరుగుదల
చింతకాని	7.08	3.78	3.30
నేలకొండపల్లి	5.24	2.29	2.95
సత్తుపల్లి	17.57	15.24	2.33
కూసుమంచి	7.91	5.82	2.09
మధిర	9.41	7.75	1.66
బోనకల్	3.85	2.40	1.45
ముదిగొండ	4.36	2.93	1.43
తిరుమలాయపాలెం	5.44	4.25	1.19
ఖమ్మంరూరల్	6.11	5.11	1.00



చెక్‌డ్యాం కూల్చివేతకు నిర్ణయం?

- ప్రకాశ్‌నగర్ చెక్‌డ్యాంపై ప్రభుత్వానికి జలవనరుల శాఖ లేఖ
- మున్నేరు ముంచెత్తడానికి ఇదే కారణమని నిర్ధారణ

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలో మున్నేటిపై మూడేళ్ల క్రితం రూ.7.5 కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రకాష్‌నగర్ చెక్‌డ్యాం కూల్చివేతకు రంగం సిద్ధమవుతున్నట్లు తెలిసింది. కూల్చివేతకు అనుమతి ఇవ్వాలని జిల్లా జలవనరుల శాఖ అధికారులు ప్రభుత్వానికి లేఖ రాసినట్లు సమాచారం. ప్రభుత్వం ఆమోదముద్ర వేయగానే త్వరలోనే చెక్‌డ్యాంను కూల్చివేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

గత ఏడాది వరదలు

గత ఏడాది సెప్టెంబర్‌లో భారీ వర్షాల సమయాన మునుపెన్నడూ లేని విధంగా మున్నేరు పొంగిపొర్లి సమీప ప్రాంతాలను ముంచెత్తింది. ఈ వరద పోటుకు మున్నేరుపై ప్రకాష్‌నగర్ వద్ద ఉన్న హైలెవల్ వంతెన పిల్లర్లు సైతం పక్కకు కదిలాయి. దీంతో అధికారులు బ్రిడ్జిపై రాకపోకలు నిలిపేసి రూ.కోటి వ్యయంతో మరమ్మతు చేయించారు. అయితే, వంతెనకు సమీపాన 40 మీటర్ల పరిధిలోనే చెక్‌డ్యాం నిర్మించడమే వరద పోటెత్తడానికి కారణంగా ఆర్‌అండ్‌బీ అధికారులు అనుమానం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీనిపై జలవనరుల శాఖ అధికారులు సైతం నివేదిక రూపొందించి కూల్చివేయడానికి ప్రభుత్వానికి పంపినట్లు తెలిసింది.

సమృద్ధిగా భూగర్భజలాలు

మున్నేటిపై ప్రకాశ్‌నగర్ వద్ద మూడేళ్ల క్రితం రూ.7.5 కోట్లతో చెక్‌డ్యాం నిర్మించారు. భూగర్భంలో నాలుగు ఫీట్లు, పైన ఏడు ఫీట్ల ఎత్తుతో దీన్ని నిర్మించగా కాలాలతో సంబంధం లేకుండా ఎప్పటికీ నీటితో కళకళలాడుతోంది. తద్వారా ఖమ్మం ఎగువ భాగంలో భూగర్భ జలాలు తగ్గకుండా ఉపయోగపడుతోంది. కానీ ఇక్కడ చెక్‌డ్యాం కారణంగానే బ్రిడ్జిపైకి వరద ముంచెత్తిందన్న నిర్ణయానికి వచ్చిన జలవనరుల శాఖ అధికారులు కూల్చివేతకు అనుమతి ఇవ్వాలని నాలుగు రోజుల క్రితం ప్రభుత్వ అనుమతి కోసం లేఖ పంపినట్లు తెలిసింది. కాగా, ఈ చెక్‌డ్యాంతో మున్నేటిలో సుమారు 0.006 టీఎంసీల నీరు నిల్వ ఉంటోందని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. వరద ముంపునకు ఇది ఎంత మేర కారణమో తెలియదు కానీ కూల్చివేస్తే ప్రభుత్వ నిధులు రూ.7.5 కోట్లు వృథా కానుండగా, సమీప ప్రాంతాలపై భూగర్భ జలాలపై ప్రభావం చూపుతుందని స్థానికులు చెబుతున్నారు.

రెండోరోజూ విధుల బహిష్కరణ

వేతనాల కోసం పెద్దాస్పత్రి కార్మికుల నిరసన

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి కార్మికులు మరోమారు విధులు బహిష్కరించారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలనే డిమాండ్‌తో కొన్నాళ్ల క్రితం మూడు రోజుల పాటు విధులు బహిష్కరించగా, ఒక నెల వేతనం చెల్లించిన అధికారులు సర్దిచెప్పడంతో విధుల్లో చేరారు. మళ్లీ ఇప్పుడు మూడు నెలల వేతనం బకాయి పడడంతో గురువారం నుంచి నిరవధిక సమ్మెకు ఉపక్రమించారు. వీరి సమ్మెతో ఆస్పత్రికి వచ్చే సాధారణ రోగులు, ఇన్ పేషంట్లు ఇబ్బంది పడుతున్నారు. ఓపీ చీటీల నమోదు, ఓపీలో వైద్యులకు సహాయకారిగా, ఆపరేషన్ థియేటర్, క్యాజువాలిటీ సేవల్లో వీరే కీలకంగా వ్యవహరిస్తుండగా సమ్మె కారణంగా ఇతరులను నియమించగా అనుభవలేమితో జాప్యం జరిగింది. దీంతో శుక్రవారం ఓపీ నమోదు వద్ద చీటీల జారీ ఆలస్యం కావడంతో క్యూ అంతకంతకు పెరిగింది. కాగా, వైద్య విధాన పరిషత్ నుంచి డీఎంఈ పరిధిలోకి ఆస్పత్రి వెళ్లాక తరచుగా వేతనాల సమస్య ఎదురవుతోంది. వీవీపీ పరిధిలో ఉన్నప్పుడు ఆస్పత్రిలో 575 పడకలకు అనుమతి ఉండడంతో 259 మంది కార్మికులను ఏజెన్సీ ద్వారా విధుల్లోకి తీసుకున్నారు. ఆపై డీఎంఈ పరిధిలోకి చేర్చాక 430 పడకలకే అనుమతి ఇవ్వడం, అంతకు ముందు మాదిరిగానే వేతన బడ్జెట్ విడుదల చేస్తుండడం సమస్యకు కారణమైంది. గతంలో ఒక్కోసారి ఏజెన్సీ బాధ్యులు సొంత నగదు చెల్లించినా, ఇప్పుడు వారికే రూ.2.50 కోట్లు బకాయి ఉండడంతో వేతనాలు చెల్లించలేని పరిస్థితి నెలకొందని సమాచారం. కాగా, కార్మికుల సమ్మెతో శుక్రవారం మున్సిపల్ కార్మికులతో శుభ్రం చేయించినా పెద్దగా ఫలితం కానరాలేదు.



ఓపీ నమోదు క్యూలైన్‌లో నిరీక్షిస్తున్న జనం



త్యాగానికి మారుపేరుగా నిలిచే బక్రీద్ పర్వదినాన్ని జిల్లావ్యాప్తంగా ముస్లింలు శనివారం జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా పలువురు స్థోమత ఆధారంగా గొర్రెలను బలి ఇచ్చి మాంసాన్ని బంధువులు, స్నేహితులకు ఖుర్బానీగా అందజేస్తారు. ఈనేపథ్యాన ఖమ్మం ముస్తఫానగర్‌లోని మహ్మదీయ షీప్ ఫామ్ తదితర చోట్ల గొర్రెలను కొనుగోలు చేయడానికి వచ్చిన ముస్లింలతో రద్దీ నెలకొంది. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలు పూర్తి చేయాలి

మధిర: సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలను అధికారులు చేరుకోవాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి ఆదేశించారు. మధిర రైతు వేదికలో శుక్రవారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. విధిగా అంతర్గత సమావేశాలు నిర్వహించుకుంటూనే సమన్వయంతో విధులు నిర్వర్తిస్తే ఫలితాలు వస్తాయని తెలిపారు. సంక్షేమ పథకాలు అర్హులకు సకాలంలో అందేలా చూడాలని, వర్షాకాలం దృష్ట్యా శిథిల భవనాలను గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.

బడిబాట ప్రారంభం

ఖమ్మంసహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమం జిల్లాలో శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా పాఠశాలల వారీగా ఉపాధ్యాయులు సమీప గ్రామాలకు వెళ్తూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యతో పాటు విద్యార్థులకు కల్పించే సౌకర్యాలపై తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా పాఠ్య, నోటుపుస్తకాలు, యూనిఫామ్ అందుతాయని తెలిపారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. బడిబాట కార్యక్రమాలకు ఉపాధ్యాయులతో పాటు అంగన్‌వాడీ టీచర్లు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్మన్లు కూడా హాజరవుతున్నారు.



బడిబాట సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ సత్యనారాయణ

ప్రతిపాదనలతోనే సరి..

- మరమ్మతులకు నోచుకోని వసతిగృహాలు
- పలు భవనాల్లో పైకప్పు లీకేజీలు, దెబ్బతిన్న గోడలు, మరుగుదొడ్లు
- వేసవి సెలవుల్లో దృష్టి సారించని యంత్రాంగం



శిథిలావస్థకు చేరిన మధిర గిరిజన బాలికల వసతిగృహం (ఇన్‌సెట్) మధిర హాస్టల్‌లోని గదిలో ఊడిన పెచ్చులు



ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల భవనాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. కొన్ని భవనాలు మరమ్మతుకు గురి కాగా.. మరికొన్ని శిథిలావస్థకు చేరాయి. భవనాల పైకప్పులకే లీకేజీలు, గోడలన్నీ పెచ్చులూడి, కిటికీలు దెబ్బతినడంతో పాటు విద్యుత్ వైరింగ్ సరిగా లేక విద్యార్థులు గత ఏడాదంతా అవస్థ పడ్డారు. అయితే, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతిగృహాల భవనాలను వేసవి సెలవుల్లో మరమ్మతు చేయించాలని ప్రతిపాదించగా ఎలాంటి స్పందన కానరాలేదు. దీంతో ఈనెల 12న వసతిగృహాలు తెరుచుకోనుండగా మళ్లీ విద్యార్థులకు సమస్యలే స్వాగతం పలకనున్నాయి.

జిల్లాలోని వసతిగృహాల వివరాలు

సంక్షేమశాఖ	వసతిగృహాలు
బీసీ	33
ఎస్సీ	52
ఎస్టీ	30

ప్రతిపాదనలు ఇలా

జిల్లాలోని బీసీ వసతిగృహాల్లో మరమ్మతులకు అధికారులు రూ.20.20లక్షలతో అంచనాలు రూపొందించారు. అలాగే, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని మధిర ఎస్టీహెచ్(షెడ్యూల్ ట్రైబ్ హాస్టల్), ముదిగొండ మండలం వల్లభిలోని ఆశ్రమ పాఠశాల, తిమ్మారావుపేట ఎస్టీహెచ్, ఖమ్మం, ఖమ్మంరూరల్ పోస్ట్‌మెట్రిక్ కాలేజీల్లోనూ మరమ్మతులకు ప్రతిపాదనలు సమర్పించారు. ఎస్సీ వసతి గృహాల్లోనూ వసతులు సక్రమంగా లేవు. జిల్లాలో మొత్తం 52 వసతి గృహాలకు గాను 49 ప్రభుత్వ భవనాల్లో, మిగిలిన మూడు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఆయా భవనాల్లో మరమ్మతులకు రూ.2,42,11,000 అవసరమని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు సమర్పించారు.

సెలవులు వృథా

వసతిగృహాల్లో పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులే వసతి పొంది చదువుకుంటారు. ఏటా చిన్నచిన్న మరమ్మతులు చేయించాల్సి ఉన్నా కొన్నేళ్లుగా పట్టించుకోకపోవడంతో సమస్యల తీవ్రత పెరిగింది. కొన్ని వసతిగృహాల్లో స్లాబ్ కురుస్తుండగా రిపేర్ చేయించకపోవడంతో ప్రస్తుతం పెచ్చులు ఊడి పడుతున్నాయి. వేసవిలో 50 రోజుల సెలవులు వచ్చినా భవనాల మరమ్మతులపై అధికారులు నిర్లక్ష్యం వహించడం గమనార్హం. కొన్ని వసతిగృహాల్లో బాత్‌రూమ్‌లకు తలుపులు కూడా లేవని, మరికొన్ని భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయని చెబుతున్నారు.

నిర్మాణానికి ఆదేశాలు

జిల్లాలో శిథిలావస్థకు చేరిన మూడు బీసీ సంక్షేమ వసతిగృహాల స్థానంలో నూతన భవనాల నిర్మాణానికి బీసీ సంక్షేమ శాఖ నిధులను మంజూరు చేసింది. ఒక్కో హాస్టల్‌కు రూ.3 కోట్ల చొప్పున మూడింటికి రూ.9 కోట్లు మంజూరయ్యాయి. ఖమ్మం ముస్తఫానగర్‌లోని బీసీ బాయ్స్ హాస్టల్, జహీర్‌పురలో బీసీ గర్ల్స్ హాస్టల్, రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెంలోని బీసీ హాస్టళ్లకు భవన నిర్మాణ పనులు మొదలుపెట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. అయినప్పటికీ ఈ మూడు భవనాలు ఈ ఏడాది అందుబాటులోకి వచ్చే అవకాశం కనిపించడం లేదు.

చిన్నచిన్న పనులైనా చేయించాలి



చాలా హాస్టళ్లలో బాత్‌రూమ్‌లకు తలుపులు, గదుల్లో కిటికీలకు తలుపులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇంకొన్నిచోట్ల పడుకునే పరిస్థితి లేదు. చిన్నచిన్న మరమ్మతులైనా చేయిస్తే విద్యార్థులకు కాస్త ఉపశమనంగా ఉంటుంది.
– వంగూరి వెంకటేష్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి

మళ్లీ పాత సమస్యలే..



నూతన విద్యాసంవత్సరంలో వచ్చే విద్యార్థులకు హాస్టళ్లలో సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. వేసవి సెలవుల్లో మరమ్మతులపై ప్రభుత్వం, యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. దీంతో వర్షాకాలంలో ఇబ్బంది ఎదురుకానుంది.
– ఇటికాల రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్, జిల్లా కార్యదర్శి

మున్నేటి ముంపు ప్రాంతాల్లో అప్రమత్తత

ఖమ్మంరూరల్: మున్నేటితో పాటు ఇతర జలాశయాల ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎన్‌డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ గౌతం సూచించారు. ముంపు కాలనీల ప్రజలకు జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు రూరల్ మండలం జలగంనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వరద సమాచారాన్ని తెలుసుకోవడం, విలువైన వస్తువులను భద్రపర్చుకోవడం, ముంపు ఎదురైతే బయటపడడం, ప్రాథమిక చికిత్సపై అవగాహన కల్పించాలరు. ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డితో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తలసేమియా బాధితుల కోసం రక్తదానం



రక్తదానం చేస్తున్న వత్సవాయి రవి, తదితరులు

ఖమ్మంఅర్బన్: తలసేమియాతో బాధపడుతున్న చిన్నారుల కోసం ఒకేరోజు 200మంది రక్తదానం చేశారు. ఖమ్మంకు చెందిన శ్రీ బాలాజీ ఎస్టేట్స్ అధినేత వత్సవాయి రవి పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ బాధితులను ఆదుకోవాలనే లక్ష్యంతో 'సంకల్ప' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన శిబిరం ఏర్పాటుచేయగా తమ ఉద్యోగులు, మార్కెటింగ్ సిబ్బంది 200 మంది రక్తదానం చేశారని తెలిపారు. అనంతరం పిల్లల మందుల కోసం శ్రీ బాలాజీ ఫౌండేషన్ తరఫున రూ.2 లక్షల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలాజీ ఎస్టేట్స్, కన్‌స్ట్రక్షన్స్ ఎండీ వత్సవాయి రేణుకతో పాటు గోసు మధు, పోగుల రవికుమార్, అనిత, డాక్టర్ నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బియ్యం

మధిర: మధిర మండలం మాటూరుపేట సమీపాన నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దెందుకూరు రోడ్డులోని ఓ కోళ్లఫామ్ షెడ్డులో బియ్యం నిల్వ చేశారనే సమాచారంతో శుక్రవారం మధిర రూరల్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 20 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

సత్తా చాటిన హ్యాండ్‌బాల్ క్రీడాకారులు



జట్టుతో అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మం స్పోర్ట్స్: నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం మంగళపల్లిలో శుక్రవారం ముగిసిన రాష్ట్రస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లా బాలికల జట్టు ద్వితీయస్థానం దక్కించుకుంది. అంతేకాక జట్టు నుంచి ఇద్దరు క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, డాక్టర్ పి.రఘునందన్ తెలిపారు. క్రీడాకారులను అధ్యక్ష, కార్యదర్శులతో పాటు పాముల శ్రీనివాసరావు, సీహెచ్.కృష్ణయ్య అభినందించారు.

అప్రమత్తతతోనే వ్యాధులకు చెక్



మాట్లాడుతున్న రాజశేఖర్‌గౌడ్

మధిర: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు దరిచేరకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ రాజశేఖర్‌గౌడ్ సూచించారు. మధిర ఆస్పత్రిని శుక్రవారం తనిఖీ చేసిన ఆయన వైద్యులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఇళ్లు, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు కావాల్సిన మేర మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. అంతేకాక వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు.

'భరత్' పూర్వవిద్యార్థికి సన్మానం



గోపీనాథ్‌ను సన్మానిస్తున్న గవర్నర్

మధిర: మధిరలోని భరత్ విద్యాసంస్థల పూర్వ విద్యార్థి ఆలపాటి గోపీనాథ్ ఇటీవల విడుదలైన సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో ఓసీ కేటగిరీలో 55వ ర్యాంకు సాధించి ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌కు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ రాజ్‌భవన్‌లో జరిగిన ఆయనను గవర్నర్ విష్ణుదేవ్ వర్మ సన్మానించారు. కాగా, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం రామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గోపీనాథ్ భరత్ విద్యానికేతన్‌లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదివాడు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.18,748

అర్ధ సెంచరీ వేడుకకు ముస్తాబు



మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల

రేపు మధిర జూనియర్ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు

- ఒకే వేదికపై కలుసుకోనున్న 55బ్యాచ్‌ల విద్యార్థులు
- దేశ, విదేశాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడిన పలువురు
- ఏర్పాట్లలో నిమగ్నమైన 'గోల్డెన్ జూబ్లీ' కమిటీ



ఆకాశ్ క్షిపణి మాజీ డైరెక్టర్ చంద్రమౌళి (ఫైల్)

మధిర: ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిశాము... చదువులమ్మ చెట్టు నీడలో... అంటూ 55 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకోనున్నారు. ఐదు దశాబ్దాలుగా మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన పలువురు దేశ, విదేశాల్లో స్థిరపడ్డారు. ఈ కళాశాల ప్రారంభించి 56ఏళ్లు అవుతుండగా స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. మధిరలో ఆదివారం (ఈనెల 8న) జరిగే ఈ వేడుకలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఈనేపథ్యాన ఆనాటి గురువులు, వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వవిద్యార్థులను ఆహ్వానిస్తూ కొద్దినెలలుగా నిర్వహణ కమిటీ కృషి చేస్తోంది.

1969లో ప్రారంభం

మధిరలోని మధిర – వైరా ప్రధాన రహదారి పక్కన పదెకరాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలను 1969లో స్థాపించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ ఈసీ గ్రూపులు ఉండగా.. అప్పట్లో సీటు సాధించడం గొప్పగా భావించేవారు. పదో తరగతిలో ప్రథమ శ్రేణి మార్కులు సాధించిన వారికే సీటు దక్కేదని చెబుతారు. కళాశాల స్థాపించాక 1995 వరకు ప్రైవేట్ కళాశాలలు లేకపోవడంతో విద్యార్థులతో కళకళలాడింది. కానీ ప్రైవేట్ కళాశాలలు ఏర్పడ్డాక ప్రభుత్వ కాలేజీ పరిస్థితి ఏటేటా ఇబ్బందుల్లో కూరుకుపోయింది. కాగా, 1993లో వృత్తి విద్యా కోర్సులైన ఎలక్ట్రీషియన్, టెక్నీషియన్ కోర్సులు, 2011లో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ) కోర్సు ప్రారంభమైంది.

అవార్డులు.. దాతల చేయూత

ఈ కళాశాలలో చదువుకున్న అనేక మంది ఉన్నత స్థాయికి చాటారు. 2017లో ప్రభుత్వం ప్రతిభా అవార్డులు ప్రకటించగా.. ఈ కాలేజీ విద్యార్థి ఉదయ్ సిద్దార్థ్ రాష్ట్రస్థాయిలో అవార్డు అందుకున్నాడు. ప్రస్తుతం కళాశాలలో 344 మంది ఉన్నారు. ఇటీవల కళాశాలను సందర్శించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నూతన భవన సముదాయానికి రూ.5కోట్లు మంజూరు చేయడంతో భవన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. కాగా, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మూడెకరాల స్థలం వదిలేసి, మిగతా స్థలాన్ని తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్‌కి కేటాయించాలని నిర్ణయించారు.

ఉత్సవాలతో మరింత అభివృద్ధి

వేలాది మంది విద్యార్థుల తలరాతలను తీర్చిదిద్దిన కళాశాల స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు పూర్వ విద్యార్థులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. 2020నాటికే కళాశాల స్థాపించి 50ఏళ్లు పూర్తయినా కోవిడ్ తదితర కారణాలతో స్వర్ణోత్సవ వేడుకలు వాయిదా పడుతూ వచ్చాయి. ఎట్టకేలకు ఈనెల 8న ఉత్సవాలు నిర్వహిస్తుండడంతో బ్యాచ్‌ల వారీగా గురువులు, పూర్వవిద్యార్థులకు సమాచారం ఇచ్చారు.

ఉన్నత స్థానాల్లో పూర్వ విద్యార్థులు

మధిర ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చదివిన పలువురు ఉన్నత స్థానాలకు చేరారు. పల్మనాలజిస్ట్ వరికూటి సుబ్బారావు, మరద్వాడా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ బండి వెంకటేశ్వర్లు, టీజీఎస్పీడీసీఎల్ సీజీఎం వంగూరి మోహన్‌రావు, ప్రముఖ దంత వైద్యులు పారుపల్లి కరుణాకర్, ఆకాశ్ క్షిపణి ప్రాజెక్టు మాజీ డైరెక్టర్ గడ్డమణుగు చంద్రమౌళి, డీఆర్‌డీఎల్ మాజీ సీనియర్ శాస్త్రవేత్త, బ్రహ్మోస్ మిస్సైల్ ప్రోగ్రామ్ మేనేజర్ గుడిశ రాజేశ్వరరావు, అలీ యావర్ జంగ్ జాతీయ భాషణ, శ్రవణ దివ్యాంగ జనుల సంస్థ సికింద్రాబాద్ అసిస్టెంట్ డైరెక్టర్ భీమని శ్రీనివాసరావు తదితరులు ఈ జాబితాలో ఉన్నారు.

అభివృద్ధికి సహకరించండి



ఎందరినో తీర్చిదిద్దిన మధిర కాలేజీ అభివృద్ధికి అంతా సహకరించాలి. నైపుణ్యం కలిగిన అధ్యాపకులు ఉన్నందున నాణ్యమైన విద్య అందిస్తున్నాం. పూర్వ విద్యార్థులు స్వర్ణోత్సవ వేడుకల నిర్వహణతో పాటు కళాశాల అభివృద్ధికి నిర్ణయించడం అభినందనీయం. – బి.జైదాస్, ప్రిన్సిపాల్

అందరూ ఒకే వేదికపైకి...



కళాశాల స్థాపించి 55ఏళ్లు కాగా, అన్ని బ్యాచ్‌ల విద్యార్థులను ఒకేచోటకు తీసుకొచ్చేలా ఆత్మీయ సమ్మేళనం వేదికగా నిలవనుంది. అందరం కలిసి జ్ఞాపకాలు నెమరువేసుకుంటాం. అలాగే, కష్టసుఖాలు పంచుకునేందుకు ఎదురుచూస్తున్నాం.
– అద్దంకి విప్లవకుమార్, పూర్వ విద్యార్థి

ఆనందంగా ఉంది..



కళాశాలలో చదువుకున్న పలువురు ఉన్నత స్థాయికి చేరారు. ఉత్సవాల్లో మేం పాల్గొననుండడం ఆనందంగా అనిపిస్తోంది. అప్పట్లో 10వ తరగతిలో అత్యధిక మార్కులు వస్తేనే కళాశాలలో సీటు వచ్చేది. గురువులు గొప్పగా బోధించేవారు.
– బెజవాడ రవిబాబు, పూర్వ విద్యార్థి

కళాశాలకు గొప్ప విశిష్టత



మా కాలేజీకి ఎంతో విశిష్టత ఉంది. పలు రాష్ట్రాలు, దేశాల్లో పూర్వ విద్యార్థులు సత్తా చాటుతున్నారు. స్వర్ణోత్సవాలు నిర్వహించాలన్న కల ఎట్టకేలకు నెరవేరుతోంది. స్వర్ణోత్సవాల వేదికపై కళాశాల విశిష్టతను అందరికీ తెలిసేలా చాటుతాం.
– కళ్యాణం వెంకటేశ్వరరావు, పూర్వ విద్యార్థి.

ఎగ్జిబిషన్‌కు బాలల సదనం చిన్నారులు



టాయ్ ట్రెయిన్‌పై చిన్నారులు

ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన జలకన్యల ఎగ్జిబిషన్‌ను సందర్శించిన చిన్నారులు ఆనందంతో ఉరకలు వేశారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ చొరవతో బాలల సదనం చిన్నారులకు ఈ అవకాశం లభించింది. ఈమేరకు శుక్రవారం చిన్నారులు ఎగ్జిబిషన్‌కు వెళ్లగా.. నిర్వాహకులు అన్నిరకాల ఆట వస్తువులను చూపించి సందడిగా గడిపేలా అవకాశం కల్పించారు. ఈమేరకు ఉల్లాసంగా గడిపిన పిల్లలు తిరిగి సాయంత్రం బాలసదనానికి చేరారు. – ఖమ్మంమయూరిసెంటర్

పుట్టినరోజు నాడే మృత్యు ఒడిలోకి...

తిరుమలాయపాలెం: పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడానికి వెళ్తున్న చెప్పిన బయలుదేరిన యువకుడు మార్గమధ్యలో జరిగిన ప్రమాదంలో కన్నుమూయడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. ఖమ్మం రూరల్ మండలం దానవాయిగూడెం గ్రామానికి చెందిన ఎలగందుల శ్రీనివాసాచారి కుమారుడు వెంకటకృష్ణ(19) శుక్రవారం తన పుట్టినరోజు సందర్భంగా బయటకు వెళ్తున్నట్లు చెప్పి బైక్‌పై తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు వైపు వెళ్లాడు. రాత్రి సమయాన తిరిగి ఇంటికి వెళ్తుండగా తిరుమలాయపాలెం ఆస్పత్రి వద్ద ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటకృష్ణ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా బైక్ నంబర్ ఆధారంగా పోలీసులు మృతుడి వివరాలు గుర్తించారు. వెంకటకృష్ణ ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతుండగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

పెనుబల్లి: మండలంలోని కొత్తకారాయిగూడెం శివారులో పలువురు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో వీఎం.బంజర్ పోలీసులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఇద్దరు పట్టుబడగా పలువురు పారిపోయారు. అక్కడ నాలుగు బైక్‌లు, రూ.5,350 నగదు స్వాధీనం చేసుకుని, మిగతా వారి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుల విస్తృత తనిఖీలు




వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఖమ్మంక్రైం: బక్రీద్ పండుగను పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేపడుతున్నట్లు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ వెల్లడించారు. త్యాగానికి ప్రతీకగా ముస్లింలు జరుపుకునే బక్రీద్ కోసం అన్ని భద్రతా ఏర్పాట్లు చేశామని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్, వెటర్నరీ, విద్యుత్ తదితర శాఖలతో సమన్వయంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. సామూహిక ప్రార్థనల సమయాన ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ప్రధాన కూడళ్లలో పోలీస్ పికెట్లు ఏర్పాటుచేశామని, మసీద్‌లు, ఆలయాలు, చర్చిల వద్ద సీసీ కెమెరాలతో నిఘా ఉంటుందని తెలిపారు. పశువుల అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు చేపడుతున్నామని పేర్కొన్నారు. మతసామరస్యానికి భంగం కలిగించేలా ఎవరు వ్యవహరించినా చర్యలు తప్పవని హెచ్చరించిన సీపీ.. సామాజిక మాధ్యమాల్లో వచ్చే తప్పుడు పోస్టులను నమ్మొద్దని ప్రజలకు పోలీసు కమిషనర్ సూచించారు.

కారు – ఆటో ఢీ, ఒకరు మృతి

మరో ముగ్గురికి తీవ్రగాయాలు



మేకల సీత (ఫైల్)

కారేపల్లి: బతుకుతెరువు కోసం ఊరూరా తిరుగుతూ పాత సామాన్ల వ్యాపారం చేసే కుటుంబంలో రోడ్డు ప్రమాదం విషాదాన్ని నింపింది. కారేపల్లి మండలంలో జరిగిన ఈ ప్రమాదం వివరాలు... మధిర పట్టణానికి చెందిన ఒకే కుటుంబ వాసులు మేకల సీత(30), అద్దంకి ఎల్లయ్య, మంగమ్మ, అద్దంకి సాయి ట్రాలీ ఆటోలో శుక్రవారం ఇల్లెందు సమీప గ్రామాల్లో తిరుగుతూ పాత సామగ్రి కొనుగోలు చేశారు. ఆపై కారేపల్లి – ఇల్లెందు ప్రధాన రహదారిలో వస్తుండగా ఆలియాతండా సమీపాన ఉసిరికాయలపల్లి శ్రీ కోటమైసమ్మతల్లి ఆర్చి వద్ద భాగ్యనగర్‌తండా గ్రామానికి చెందిన గుగులోతు రోమి, ఆయన సోదరుడు కారులో వెళ్లా క్రమాన రెండు వాహనాలు ఢీకొన్నాయి. రెండు వాహనాలు రోడ్డు పక్కకు దూసుకెళ్లగా మేకల సీత తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందింది. అలాగే, ఆటోలో ఉన్న సాయి, ఎల్లయ్య, మంగమ్మకు సైతం గాయాలయ్యాయి. కారులో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారేపల్లి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

ట్యాంకర్ ఢీకొనడంతో వాహనదారుడు..

కొణిజర్ల: మూడు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఓ వ్యక్తి మృతి చెందగా మరి కొందరు గాయాల పాలయ్యారు. కొణిజర్లలో శుక్రవారం జరిగిన ఈ ప్రమాదాల వివరాలను ఎస్ఐ గుగులోత్ సూరజ్ వెల్లడించారు. ఖమ్మం వైపు నుంచి వస్తున్న స్కూటీని ఖమ్మం వైపు నుంచే వస్తున్న ఆయిల్ ట్యాంకర్ వెనక నుంచి ఢీకొట్టగా ద్విచక్రవాహనంపై ఉన్న ఏదులాపురానికి చెందిన వేలుపుల వెంకన్న(50) తలకు బలమైన గాయాలయ్యాయి. ఆయనకు ఖమ్మంలో చికిత్స అనంతరం హైదరాబాద్ తరలిస్తుండగా మృతి చెందాడు. వెంకన్న భార్య కళావతి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే, వైరా వైపు నుంచి ఖమ్మం వెళ్తున్న మణుగూరు డిపో ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న టిప్పర్‌ను ఢీకొట్టగా బస్సు అద్దాలు పగిలి అందులో ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రుడు యలమంచి గోపీకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, ఖమ్మం నుంచి భద్రాచలం ఆర్టీసీ లహరి బస్సు వెళ్తుండగా, ఒకేసారి కొణిజర్ల ఊరిలో నుంచి జేసీబీ రావడంతో క్రేన్ ముందు భాగం బస్సుకు తగిలి అద్దాలు పగిలిపోయాయి. అలాగే, జేసీబీ పక్కకు ఒరగడంతో రోడ్డు పక్కన నిలిపిన ద్విచక్రవాహనం నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో జేసీబీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

ఆటో పల్టీ : వ్యక్తి మృతి

నేలకొండపల్లి: ఆటో బోల్తా పడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. నేలకొండపల్లికి చెందిన కె.ఉమామహేశ్వరరావు (70) కోడిగుడ్ల వ్యాపారం చేస్తారు. రోజు మాదిరిగానే శుక్రవారం ఆటోలో కోడి గుడ్ల కోసం ఖమ్మం వెళ్తుండగా గంగమ్మ ఆలయం వద్ద ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడిది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఉమమహేశ్వరరావుకు స్థానికంగా చికిత్స అనంతరం ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

మనోవేదనతో వృద్ధుడు ఆత్మహత్య

ఖమ్మంఅర్బన్: ఖమ్మం ఎస్ఆర్ గార్డెన్స్ సమీపాన సాగర్ ప్రధాన కాల్వలో దూకిన ఒక వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపిన వివరాలు... రఘునాథపాలెం మండలంలోని వీ.వీ.పాలెంకు చెందిన బి.లాల్యా(70) భార్య రెండేళ్ల క్రితం క్రితం మృతి చెందగా మద్యానికి బానిసయ్యాడు. అంతేకాక మనోవేదన చెందుతూ రెండు రోజుల క్రితం ఇంటి నుండి వెళ్లిన ఆయన సాగర్ కాల్వలో దూకి బలవన్మరణానికి పాల్పడినట్లు భావిస్తున్నారు. ఈమేరకు అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు బృందం ఆధ్వర్యాన లాల్యా మృతదేహాన్ని వెలికితీసినట్లు సీఐ భానుప్రకాష్ తెలిపారు.

మద్యం మత్తులో గొడవ

కల్లూరు: కల్లూరులోని ఓ హోటల్ వద్దకు శుక్రవారం సాయంత్రం మద్యం మత్తులో వచ్చిన కొందరి తీరుతో ఘర్షణ చోటు చేసుకుంది. తల్లాడ మండలం బిల్లుపాడుకు చెందిన నలుగురు వచ్చి చపాతీ, పరోటా కావాలని అడడగా ఇంకో గంట పడుతుందని సిబ్బంది చెప్పారు. సిబ్బందితో గొడవ పడి వెళ్లిపోయిన వారు ఆతర్వాత మరికొందరితో కలిసి వచ్చి ఘర్షణకు దిగారు. అదే సమయాన ఆ మార్గంలో వెళ్తున్న ఎస్ఐ డి.హరిత చేరుకుని సర్దిచెబుతుండగా అందులో ఇద్దరు ఆమెతోనూ దురుసుగా ప్రవర్తించారు. దీంతో వారిని పెనుబల్లి స్టేషన్‌కు తరలించారు.

ఎస్సెస్సీ టాపర్ల ఢిల్లీ యాత్ర



ఢిల్లీలో సన్సద్ భవన్ వద్ద విద్యార్థులు, ఫౌండేషన్ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల నుంచి టాపర్లుగా నిలిచిన విద్యార్థలను మిత్ర ఫౌండేషన్ ద్వారా విమానంలో ఢిల్లీ యాత్రకు తీసుకెళ్లారు. ప్రతిభ కనబర్చిన తొమ్మిది మంది విద్యార్థులకు రూ.3 లక్షల నగదు, ఒక ల్యాప్‌టాప్ అందించిన ఫౌండేషన్ బాధ్యులు ఢిల్లీ పర్యటనకు కూడా తీసుకెళ్తామని ప్రకటించారు. ఇందులో భాగంగా మిత్ర ఫౌండేషన్ చైర్మన్ కురివెళ్ల ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యాన విద్యార్థులు పచావ వెన్నెల, మాఘం యశ్వంత్, చింతోసు సాయితో పాటు మరో ఆరుగురిని విమానంలో ఢిల్లీ తీసుకెళ్లగా పార్లమెంట్ భవనం, రాష్ట్రపతి భవనం, అక్షరధామ్, ఎర్రకోట, ఇండియా గేట్ తదితర ప్రాంతాలను సందర్శించారు. అలాగే, కేంద్ర గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసి ఆయన నివాసంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ విమానంలో ఢిల్లీకి వెళ్లడం తమకు జ్ఞాపకంగా నిలిచిపోతుందని తెలిపారు. యాత్రకు సహకరించిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, డీఈఓ సత్యనారాయణకు ఫౌండేషన్ చైర్మన్ కురువెళ్ల ప్రవీణ్‌కుమార్, కార్యదర్శులు రంగ శ్రీనివాస్, నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు.

103 శాతం బొగ్గు ఉత్పత్తి

ఐదు ఏరియాల్లో 100 శాతం



ఓపెన్ కాస్ట్ గనిలో బొగ్గు లోడ్ చేస్తున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ 2025–26 ఆర్థిక సంవత్సరంలో 76 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో మే నెలలో సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11ఏరియాల్లోని 19 ఓపెన్‌కాస్ట్ గనులకు, 21భూగర్భ గనులకు 56.50 మిలియన్ లక్షలటన్నుల లక్ష్యానికి 58.22 లక్షల టన్నులు 103 శాతం మాత్రమే సాధించినట్లు సింగరేణి తన గణాంకాల్లో తెలిపింది. కాగా సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11ఏరియాల్లోని భూగర్భగనుల్లో 4.90లక్షల టన్నుల లక్ష్యానికి 3.50లక్షల టన్నులు 72శాతం ఉత్పత్తి చేయగా, ఓపెన్ కాస్ట్ గనుల్లో 51.60 లక్షల టన్నులకు గాను 54.72 లక్షల టన్నులు 106 శాతం సాధించింది. ఓవరాల్‌గా 56.50 లక్షల టన్నుల లక్ష్యానికి 58.22లక్షల టన్నులు 103శాతం ఉత్పత్తి జరిగింది.

మే మాసంలో మెరుగైన ఉత్పత్తి...

గడచిన ఏప్రిల్‌లో సాధించిన ఉత్పత్తి (95శాతం) కంటే మే లో 103 శాతం అంటే 8 శాతం (నెలవారీ ఉత్పత్తి) అదనంగా ఉత్పత్తి జరిగింది. అంతేకాకుండా ఏప్రిల్‌లో మణుగూరు ఏరియా 10.88 లక్షల టన్నులు సాధించి మొదటి స్థానంలో నిలవగా, ఆర్జీ–2 ఏరియా 4.99 లక్షల టన్నులు సాధించి రెండో స్థానంలో నిలిచింది. మే నెలలో 5 ఏరియాలు (కొత్తగూడెం 107 శాతం, మణుగూరు 119 శాతం, శ్రీరాంపూర్ 100 శాతం, ఆర్జీ–2 133 శాతం, ఆర్జీ–3 100 శాతం,) 100 శాతం సాధించాయి. సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లోని భూగర్భ గనులు, ఓపెన్ కాస్ట్ గనుల్లో 49.90 లక్షల టన్నులు 95 శాతం సాధించగా, మే లో 10.81 లక్షల టన్నులు 99శాతం అంటే గతంలో కంటే మరో 4శాతం అదనంగా సాధించింది.

తీరు మార్చుకోని ఆరు ఏరియాలు..

సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లో మే మాసంలో ఐదు ఏరియాలు మాత్రమే 100 శాతం ఉత్పత్తి సాధించగా, మిగిలిన ఆరు ఏరియాలు వెనుకంజలో ఉన్నాయి. అయితే సింగరేణి సంస్థ ఉన్నతాధికారులు ఏరియాలలోని భూగర్భ, ఓపెన్ కాస్ట్ గనులకు నిర్దేశించిన నెలవారి, వార్షిక లక్ష్యాలను కచ్చితంగా సాధించాలని రివ్యూ మీటింగ్‌లలో పలుమార్లు చెప్పినప్పటికీ అధికారుల పనీతీరులో మార్పు రాలేదు.

లక్ష్యంసాధించిన కొత్తగూడెం మణుగూరు, ఆర్జీ–2...

మే మాసంలో కొత్తగూడెం ఏరియా 107శాతం, వార్షిక లక్ష్యం 100శాతం సాధించగా, మణుగూరు ఏరియా మే నెలలో 119శాతం, వార్షిక లక్ష్యంలో 118శాతం సాధించినప్పటికీ ఓవరాల్‌గా కొత్తగూడెం ఏరియా 13.96 లక్షల టన్నులు, వార్షిక లక్ష్యం 26.04 లక్షల టన్నులు సాధించి సింగరేణి వ్యాప్తంగా అగ్రస్థానంలో ఉండగా, మణుగూరు ఏరియా మేలో 11.74 లక్షల టన్నులు, వార్షిక లక్ష్యంలో 22.63 లక్షల టన్నులు సాధించి రెండో స్థానంలో నిలిచాయి. కంపెనీ రెండు నెలలో 108 లక్షల్లో కొత్తగూడెం రీజియన్ 53 లక్షలు సాధించటం విశేషం. అయితే మిగతా రెండు రీజియన్లు 55 లక్షల టన్నులు సాధించటం గమనార్హం. కాగా, ఆర్జీ–2 ఏరియా మే నెలలో 133 శాతం, రెండు నెలలో 159 శాతం సాధించి మూడు స్థానంలో ఉంది.

ఉన్నతాధికారులు సమీక్షించాలి..



ప్రతీ మంగళ, శనివారం సింగరేణిభవన్ నుంచి సీఎండీ వివిధ విభాగాల డైరెక్టర్లు, జీఎంలతో బొగ్గు ఉత్పత్తిపై చర్చిస్తున్నారు. అయితే వాటి అమలుపై కూడా ఉన్నతాధికారులు సమీక్షించాలి. ఏ నెలలో ఏ గనిలో ఉత్పత్తి తగ్గిందో కారణాలు తెలుసుకుని పరిష్కరిస్తే ఉత్పత్తి మెరుగవుతుంది.
– రియాజ్ అహ్మద్, హెచ్ ఎంఎస్ జనరల్ సెక్రటరీ

పనిగంటలు పెంచితే లక్ష్యసాధన సులువే..



ఓపెన్ కాస్ట్ గనుల్లో 66 శవల్స్ రోజుకు 19గంటలు నడవాల్సింది 12గంటలు అయితే 74 శాతమే నడుస్తున్నాయి. 425 డంపర్లు 18 గంటలు పనిచేయాల్సి ఉండగా, 8గంటలే పనిచేస్తున్నాయి. 48డ్రిల్స్ 20 గంటలకు 5 గంటలే పనిచేస్తున్నాయి. ఇదంతా సరిదిద్దితే లక్ష్యాన్ని సాధించవచ్చు.
– వెంకటేశ్వర్లు ప్రాజెక్ట్, ప్లానింగ్ డైరెక్టర్

అర్హులకే ఇళ్లు ఇవ్వాలని ఆందోళన



ఆందోళనకు దిగిన గ్రామస్తులు

కూసుమంచి: అర్హత కలిగిన పేదలకు మాత్రమే ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయాలని కోరుతూ మండలంలోని గట్టుసింగారం గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో పలువురు గూడు లేని పేదలు ఉన్నా వారికి కాదని అనర్హులకు మంజూరు చేశారని ఆరోపించారు. ఈ విషయమై ఇటీవల గ్రామానికి వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్తే అర్హులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారని తెలిపారు. అయినా పట్టించుకోకపోవడంతో ఆందోళనకు దిగినట్లు వెల్లడించారు.